# ఆర్‌సిబి కాదు..ఇండియా

## కోహ్లీ వీడియో వైరల్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21 (సమ సమాజం): ఆస్ట్రేలియాతో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. టీమిండియా స్టార్ బ్యాట్స్ మెన్ విరాట్ కోహ్లీ స్లిప్?లో ఫీల్డింగ్ చేస్తోన్న టైమ్?లో అభిమానులు ఆర్సీబీ .. ఆర్సీబీ అంటూ కేకలు వేశారు. దీనిపై స్పందించిన కోహ్లీ.. అలా అనొద్దని సైగ చేసి .. తన షర్ట్ పై ఉన్న ఇండియా లోగోను చూపించాడు. ఆ తరువాత అభిమానులంతా ఇండియా.. ఇండియా అంటూ కేకలు వేస్తూ కోహ్లీని ఎంకరేజ్ చేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ.. దటీజ్ కోహ్లీ.. అతనికే దేశమే ముఖ్యం అని కామెంట్స్ పెడుతున్నారు. మరోవైపు రెండో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 115 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా నాలుగు వికెట్ల కోల్పోయి ఛేదించింది. దీంతో టీమిండియా ఇప్పుడు నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 2–0 తో ఆధిక్యంలో ఉంది. మూడో టెస్టు ఇరు జట్ల మధ్య మార్చి 1 నుంచి ఇండోర్ లో స్టార్ట్ కానుంది.

# పృథ్వీషా రెచ్చగొట్టాడంటూ సప్నా గిల్ కేసు



ముంబయి, ఫిబ్రవరి 21 (సమ సమాజం): బెయిలుపై బయటకు వచ్చాక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సప్నా గిల్ భారత క్రికెటర్ పృథ్వీ షాపై కేసు పెట్టారు. క్రికెటర్ పృథ్వీ షా స్నేహితుడి కారును ధ్వంసం చేసినందుకు ఒషివారా పోలీసులు కేసు పెట్టిన 8మందిలో సప్నా గిల్ ఒకరు. తమను మొదట రెచ్చగొట్టింది భారత క్రికెటర్, అతని స్నేహితులేనని సప్నాగిల్ ఆరోపించారు. సెల్ఫీ వివాదంలో క్రికెటర్ కు సప్నాగిల్ కు మధ్య జరిగిన గొడవలో కారు విండ్‌షీల్డ్ దెబ్బతింది. సోషల్ మీడియా ఫేమ్ అయిన సప్నాగిల్ క్రికెటర్ పృథ్వీ అతని స్నేహితుడు ఆశిష్ యాదవ్‌పై ముంబై ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఈ ఫిర్యాదుతో వివాదం ముగిసేలా కనిపించడం లేదు.మెజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేయడంతో సప్నా గిల్ ముంబై పోలీసు కస్టడీ నుంచి బయటకు వచ్చిన తర్వాత తాజాగా కేసు పెట్టారు.ముంబయిలోని ఓ హోటల్‌లో భోజనం చేస్తుండగా పృథ్వీ షా సెల్ఫీలకు నిరాకరించడంతో ఈ గొడవ జరిగింది.

# ఆస్ట్రేలియాకు గాయాల బెడద

## కెప్టెన్ కమిన్స్ బాటలోనే దూరమైన వార్నర్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (సమ సమాజం): బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో వరుస పరాజయాలతో ఇంటా బయటా విమర్శలెదుర్కొంటున్న ఆస్ట్రేలియాను గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే వ్యక్తిగత కారణాలతో కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్వదేశం వెళ్లగా... గాయంతో స్టార్ పేసర్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అయితే తాజాగా డేవిడ్ వార్నర్ సైతం సిరీస్ నుంచి తప్పుకున్నాడు. రెండో టెస్ట్‌లో మోచేతి గాయం బారిన పడిన డేవిడ్ వార్నర్.. మూడు, నాలుగు టెస్ట్‌లకు అందుబాటులో ఉండటం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. ఢిల్లీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ వేసిన బౌన్సర్.. డేవిడ్ వార్నర్ మోచేతికి తాకింది. ఫిజియో పర్యవేక్షణ తర్వాత కొద్దిసేపు బ్యాటింగ్ చేసిన వార్నర్ షమీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. గాయం కారణంగా అతడు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కి రాలేదు. వార్నర్ స్థానంలో కంకూషన్ సబ్‌స్టిట్యూట్‌గా మ్యాట్ రెంషాని టీమ్‌లోకి వచ్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఉస్మాన్ ఖవాజాతో కలిసి ట్రావిస్ హెడ్ ఓపెనింగ్ చేశాడు. గాయం వల్ల మిగతా రెండు టెస్టులకు దూరమైన వార్నర్..వన్డే సిరీస్ వరకైనా కోలుకుంటాడా..లేదా.. అనేది అనుమానంగా మారింది. అయితే టెస్టు సిరీస్‌కి దూరమైన వార్నర్ వన్డే సిరీస్‌లో ఆడతాడని క్రికెట్ ఆస్ట్రేలియా ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



# హర్మన్ ప్రీత్ కౌర్ టీ20ల్లో అరుదైన రికార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (సమ సమాజం):భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ టీ20ల్లో అరుదైన రికార్డు సృష్టించింది. ఈ ఫార్మాట్‌లో 150 మ్యాచులు ఆడిన తొలి క్రికెటర్‌గా చరిత్ర కెక్కింది. టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఐర్లాండ్?తో జరిగిన మ్యాచులో హర్మన్ ప్రీత్ కౌర్ ఈ రికార్డు నెలకొల్పింది. ఈ జాబితాలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 148 మ్యాచులతో రెండో స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ మహిళల జట్టు కెప్టెన్ సుజీ బేట్స్ 143 మ్యాచ్‌లతో మూడో ప్లేస్‌లో కొనసాగుతోంది. 50వ మ్యాచులో హర్మన్ ప్రీత్ కౌర్ మరో ఘనత సాధించింది. టీ20ల్లో 3 వేల పరుగులు పూర్తి చేసింది. 2009లో టీ20ల్లో అరంగేట్రం చేసిన హర్మన్ ప్రీత్ కౌర్...150 మ్యాచుల్లో 3006 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ, 9 అర్ధసెంచరీలున్నాయి.

# శ్రీవారిని దర్శించుకున్న సూర్యకుమార్



తిరుమల, ఫిబ్రవరి 21 (సమ సమాజం): టీమిండియా టీ20 సంచలనం, పొట్టి క్రికెట్‌లో వరల్డ్ నంబర్ 1 అయిన సూర్యకుమార్ యాదవ్ సతీసమేతంగా మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. మూడో టెస్టుకు వారంపైగా సమయం ఉండడంతో సూర్య, భార్య దేవిషతో కలిసి తిరుమలకు వెళ్లాడు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం గుడి ఆవరణలో ఫొటోలు దిగాడు. ఈ స్టార్ ప్లేయర్ తిరుమల దర్శనం ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఆ ఫొటోలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. జనవరిలో సూర్య ఉజ్జయిని మమంకాళేశ్వర్ ఆలయానికి వెళ్లాడు. కారు యాక్సిడెంట్‌లో గాయపడ్డ వికెట్ కీపర్ రిషభ్ పంత్ త్వరగా కోలుకోవాలని పూజలు చేసిన విషయం తెలిసిందే. వన్డేలు, టీ20ల్లో చెలరేగుతున్న సూర్య బోర్డర్ ? గవాస్కర్ ట్రోఫీతో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. అయితే.. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో తక్కువ స్కోర్‌కే పెవిలియన్ చేరాడు. రెండో టెస్టులో భారీ స్కోర్ చేస్తాడని ఫ్యాన్స్ ఊహించారు. కానీ, గాయం నుంచి కోలుకున్న శ్రేయాస్ అయ్యర్ జట్టులోకి రావడంతో సూర్య రెండో టెస్టుకు బెంచ్‌కే పరిమితం అయ్యాడు. ఇండోర్‌లో మార్చి 1న జరిగే మూడో టెస్టులో అతడికి ఛాన్స్ వస్తుందా? లేదా? అనేది చూడాలి. తొలి రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత్ నాలుగు టెస్టుల సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలో ఉంది.







కాంతారాకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు

చిన్న సినిమాగా వచ్చి ఎక్స్‌పెక్ట్ చేయని రీతిలో రికార్డు సృష్టించిన కాంతార సినిమాకు మరో ఘనత దక్కింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును సొంతం చేసుకుంది. మోస్ట్ ప్రామిసింగ్ యాక్టర్ కేటగిరీలో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టిని ఈ పురస్కారం వరించింది. ముంబయిలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 2023 సంవత్సరానికి గానూ కాంతారకు ఈ అవార్డు దక్కింది. ఈ విషయాన్ని నటుడు రిషబ్ శెట్టి ఇన్ స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ఈ అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ పురస్కారం దక్కడం గౌరవంగా భావిస్తున్నానన్న ఆయన.. తనను నమ్మి అవకాశం ఇచ్చిన హోంబాలే ఫిల్మ్స్ కు, విజయ్ కిరగందూర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. తన భార్య ప్రగతి శెట్టికి, మద్దతు ఇచ్చిన కాంతారావు బృందానికి, సాంకేతిక నిపుణులకు రిషబ్ శెట్టి ధన్యవాదాలు తెలిపారు. దాంతో పాటు ఈ అవార్డును తాము దైవంగా భావించే పవర్ స్టార్, లెజెండరీ భగవాన్ పునీత్ రాజ్ కుమార్ కు అంకితం చేస్తున్నానని పోస్ట్ లో రాసుకొచ్చారు.

# అల్లరి నరేశ్ ఉగ్రం టీజర్ నేడు విడుదల




నాంది సినిమాతో మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేశ్ తర్వాత సినిమాల ఎంపికలో కాస్త రూటు మార్చేశాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రం ఉగ్రం. నాంది ఫేం విజయ్ కనకమేడల మరోసారి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. మలయాళ భామ మిర్ణా హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ఉగ్రం టీజర్‌ను బుధవారం ఉదయం 11:34 గంటలకు లాంఛ్ చేయబోతున్నట్టు తెలియజేస్తూ ఓ పోస్టర్‌ను షేర్ చేసుకున్నాడు అల్లరి నరేశ్. నేను ఇంతకుముందెన్నడూ చేయని, మీరు ఇంతముందు ఎన్నడూ చూడని.. కొత్త అంశంతో మీ ముందుకొస్తున్నా అంటూ టీజర్ అప్‌డేట్ అందించాడు. డార్క్ షేడ్స్ ఉన్న లొకేషన్ నుంచి అల్లరి నరేశ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వస్తున్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఉగ్రం చిత్రానికి టూమ్ వెంకట్, అబ్బూరి రవి కథ, సంభాషణలు సమకూరుస్తున్నారు. ÷న్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఉగ్రం చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. ఈ మూవీ మే 5న థియేటర్లలో సందడి చేయనుండగా.. ఈ ఏడాది ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు అల్లరి నరేశ్. ఈ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది.

# ఎన్టీఆర్ సరసన జాన్వీ ఓకే అయినట్టేనా ?



తల్లి శ్రీదేవితో జ్ఞాపకాలను పంచుకున్న జాన్వీ

గత కొంతకాలంగా శ్రీదేవి ముద్దుల కూతురు జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురు చూస్తోంది. అయితే ఆమె పెడుతున్న డిమాండ్స్ కారణంగానే ప్రతీ నిర్మాత జాన్వీని టాలీవుడ్‌కు పరిచయం చేయాలన్న ఆలోచనని విరమించు కుంటూ వస్తున్నారట.అయితే ఫైనల్ గా జాన్వీ కపూర్ టాలీవుడ్ స్టార్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో కలిసి నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన 30వ ప్రాజెక్ట్ ని స్టార్ డైరెక్టర్ కొరటాల శివతో చేయబోతున్న విషయం తెలిసిందే. గత కొన్ని నెలలుగా వివిధ కారణాల వల్ల రెగ్యులర్ షూటింగ్ వాయిదా పడుతూ వస్తున్న ఈ మూవీ త్వరలోనే సెట్స్ పైకి వెళ్లబోతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా జాన్వీ కపూర్ టాలీవుడ్ లోకి తెరంగేట్రం చేయబోతోంది. అయితే ఈ మూవీలో నటించడానికి జాన్వీ ఏకంగా 5 కోట్లు పారితోషికం డిమాండ్ చేసిందట. అంతే కాకుండా తన వ్యక్తిగత సిబ్బందిని కూడా భరించాలని చెప్పిందట. అయితే మేకర్స్ మాత్రం 4 కోట్లు మాత్రమే ఇస్తామని వ్యక్తిగత సిబ్బందికి అయ్యే ఖర్చుల్ని కూడా భరిస్తామని చెప్పడంతో జాన్వీ కపూర్ ఫైనల్ గా ఎన్టీఆర్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా చెబుతున్నారు. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇకపోతే జాన్వీ కపూర్ సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ చలాకీగా, చురుకుగా తన ఫోటోస్ పెడుతూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది జాన్వీ కపూర్. తన తల్లి శ్రీదేవి 5వ వర్ధంతి ఈ నెల 24వ తేదీన రానుంది. ఈ సందర్భంగా జాన్వీ కపూర్ తన తల్లిని తలుచుకుంటూ భావోద్వేగమయిన మాటలు తన పోస్ట్ చేసింది. అలాగే తాను తన తల్లితో వున్న ఫోటో కూడా షేర్ చేసింది.తన తల్లి గురించి జాన్వీ ఎప్పుడూ తలుచుకుంటూ ఉంటుంది అని తెలుస్తోంది ఆ మాటలు చూస్తుంటే. ఏ పని చేసినా, ఎక్కడికి వెళ్లినా, నిన్నే తలుచుకుంటా, నీ గురించే వెతుకుతా అని పెట్టింది అంటే, తల్లి గురించి ఎంత ఆలోచిస్తోందో పాపం అనిపిస్తుంది. 'నేను ఇప్పటికీ నీ కోసం ప్రతిచోటా వెతుకుతున్నాను అమ్మా, నేను చేస్తున్న ప్రతి పనీ, నువ్వు గర్వించదగ్గవిగా ఉంటుందని నేను ఆశిస్తున్నాను. నేను ఎక్కడికి వెళ్లినా, ఏ పని చేసినా నీతోటె మొదలయి, నీతోటె ముగుస్తుంది', అని పోస్ట్ చేసింది జాన్వీ కపూర్.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in